క్లుప్తంగా

బాటసారులకు మజ్జిగ పంపిణీ



రామవరప్పాడు: శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా బుధవారం ప్రసాదంపాడులో వాసవి జాగృతి ఇంటర్నేషనల్ పితృదేవోభవ క్లబ్ ఆధ్వర్యంలో బాటసారులు, ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగ, అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు. గ్రామంలోని స్కోడా షోరూమ్ సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ట్రాఫిక్ ఎస్ఐ ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్య వైశ్యుల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ వేసవిలో పలు గ్రామాల్లో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ వుడత్తు నరేంద్ర, వుడత్తు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు అంగన్‌వాడీల మద్దతు



కంకిపాడు: కార్మిక చట్టాల పరిరక్షణ కోసం చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయు కంకిపాడు, పెనమలూరు మండలాల అధ్యక్షులు తాడంకి నరేష్, యు.త్రిమూర్తులు డిమాండ్ చేశారు. కంకిపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం కార్యాలయ అధికారులకు సమ్మె నోటీసు అందించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయటంతో పాటుగా అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు వై.లక్ష్మీ ప్రసన్న, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి మూడు రోజులు మున్సిపల్ కార్మికుల సమ్మె



పెనమలూరు: ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెకు తాడిగడప మున్సిపాలిటీ కార్మికులు పూర్తి మద్దతు ప్రకటించారు. ఆరోజు సమ్మెలో పాల్గొంటామని పేర్కొంటూ బుధవారం కమిషనర్ పి.భవానీప్రసాద్‌కు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీలలో రాష్ట్ర మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగుతుందన్నారు. మున్సిపల్ కార్మికులు మూడు రోజుల పాటు సమ్మెలో పాల్గొంటారన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షేక్ కాశిం, నేతలు వై.సరళ, సీహెచ్ రత్నకర్ణ, వి.జోజిమేరి, టి.వెంకటరెడ్డి, ఎ.డేవిడ్, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

మన్యం వీరుడు అల్లూరి వర్ధంతి



విజయవాడరూరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం బుధవారం విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎంపీడీఓ బి.వి గ్గిన్స్, ఏఓ పి.మురళీకృష్ణ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

యోగా, ఆహార అలవాట్లపై అవగాహన

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ శిబిరంలో బుధవారం యోగా, ఆహార అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా, ధ్యానం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందుతాయని, శారీరక, మానసిక ఉల్లాసం కలగటంతో పాటుగా పలు ప్రయోజనాలను పొందవచ్చని గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలతాదేవి వివరించారు. విద్యార్థులతో రకరకాల యోగాసనాలు, ధ్యానం చేయించారు. ఆరోగ్యవంతమైన జీవనం కోసం పాటించాల్సిన ఆహారపు అలవాట్లను గూర్చి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో ఆటలు ఆడించటంతో పాటుగా, నృత్య శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఎనీ టైం అవుట్ ఆఫ్ సర్వీస్

- మొరాయిస్తున్న ఏటీఎంలు
- సేవలు అందక ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు
- పట్టించుకోని బ్యాంకర్లు

కంకిపాడు: ఏటీఎం అంటే ఎనీ టైం మనీ అనేది ఒకప్పటి మాట. ఎనీటైం అవుట్ ఆఫ్ సర్వీస్ అన్నది నేటి మాట. ప్రస్తుతం సాంకేతిక సమస్యలు, ఇతర మరమ్మతుల కారణంగా మండల కేంద్రమైన కంకిపాడులో ఎక్కడ చూసినా ఏటీఎంలు పనిచేయటం లేదు. అరకొర పనిచేసినా అక్కడ ఖాతాదారులు క్యూ కడుతున్నారు. ఏటీఎంల నిర్వహణను బ్యాంకర్లు విస్మరించటంతో సేవలు అందక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఖాతాదారులు వాపోతున్నారు. సుమారు 40 గ్రామాలకు కంకిపాడు పట్టణం ప్రధాన కేంద్రం. పెనమలూరు, ఉంగుటూరు, గన్నవరం, తోట్లవల్లూరు మండలాలకు చెందిన ప్రజలు నిత్యం ఈ ప్రాంతానికి చేరుకుంటారు. వస్త్రాలు, బంగారం, మిఠాయిలు, రైతుబజారు సేవలు పొందుతుంటారు. దీంతో ఇక్కడికి వచ్చే ప్రజలు తమకు అవసరమైన నగదు సేవలకు స్థానికంగా అందుబాటులో ఉన్న వివిధ బ్యాంకుల ఏటీఎంలను ఆశ్రయిస్తుంటారు.

అయితే గత కొద్ది రోజులుగా పలు బ్యాంకులకు చెందిన ఏటీఎంలు నిర్వహణా లోపాల కారణంగా సేవలు అందించలేకపోతున్నాయి. సాంకేతిక సమస్యలు, మరమ్మతులు కారణంగా ఏటీఎంలు



కంకిపాడు-గన్నవరం రోడ్డు కూడలిలో పనిచేయని ఏటీఎం



కంకిపాడు ఎస్‌బీఐ బ్రాంచిలో పనిచేయని ఏటీఎం

మూలనబడ్డాయి. ఎప్పుడు చూసినా వాటిపై ఏటీఎం పనిచేయటం లేదనే బోర్డులే దర్శనమిస్తున్నాయి. ఒక వేళ పనిచేసినా అందులో నగదు లేకపోవటం, సాంకేతిక సమస్య ఉందంటూ వచ్చే మెసేజ్‌లతో ప్రజలు విసుగెత్తిపోతున్నారు. బ్యాంకులకు వెళ్లలేని పరిస్థితుల్లో ఏటీఎంలను ఆశ్రయిస్తున్న తరుణంలో ఏటీఎంలు మొరాయించటంతో ప్రజలు విస్మయం చెందుతున్నారు. బ్యాంకర్లు సమస్యను గుర్తించినా పరిష్కరించటంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని, ఏటీఎం సేవలు సమర్థంగా అందిస్తున్నామంటూ ప్రచారం చేసుకోవటం ఎందుకంటూ ప్రశ్నిస్తున్నారు.

ఎప్పుడూ మూసే ఉంటుంది



ప్రధాన సెంటరులో ఎస్‌బీఐకి చెందిన ఏటీఎం ఎప్పుడు చూసినా మూతబడే ఉంటుంది. మేము షెడ్‌లో ఉండి పనిచేసుకుంటేనే కుటుంబం గడుస్తుంది. బ్యాంకుకు వెళ్లి నగదు సేవలు పొందాలంటే ఒక పూట అంతా పని పోతుంది. అక్కడ సమాధానం చెప్పే నాథులుండరు. ఏటీఎంలను ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

–కరీముల్లా, మెకానిక్, కంకిపాడు

సేవలు మెరుగు పర్చాలి



నిత్యం ఏదో పని మీద విజయవాడ, కంకిపాడు ప్రాంతాలకు రాక తప్పదు. డబ్బుల కోసం ఏటీఎంలకు వెళితే అవి పనిచేయటం లేదు. చిన్న చిన్న చెల్లింపులు ఉన్నాయి. డబ్బులు కోసం తిరగని ఏటీఎం లేదు. బ్యాంకర్లు ఏటీఎంల నిర్వహణపై దృష్టి పెట్టాలి. సేవలు సమర్థంగా అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలి.

–మరీదు హరిబాబు, కుందేరు

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు



కంకిపాడు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



ఉయ్యూరు గ్రంథాలయంలో క్యారమ్స్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

కంకిపాడు: వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం మండలంలోని తెన్నేరు శాఖా గ్రంథాలయంలో భగవద్గీత శ్లోకాల పఠనం, పుస్తక పఠనం, కథలు చెప్పటం, వినటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆసక్తి గల చిన్నారులకు నృత్యం, చెస్, క్యారమ్స్‌లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాలను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై పోటీలు నిర్వహించారు. ఆట పాటలతో చిన్నారులు సందడి చేశారు. విద్యార్థులకు ఆరోగ్యాన్ని పెంపొందించే యోగ, వ్యాయామంపై శిక్షణ అందించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ, ఎస్.అప్పారావు, టీసీఎస్ బాబు పర్యవేక్షించారు.

ఉయ్యూరులో...

ఉయ్యూరు: ఉయ్యూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. బుధవారం విద్యార్థులకు చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. గణితంలో మెలకువలు నేర్పారు. గ్రంథాలయాధికారి రమణి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



గన్నవరంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

గన్నవరంలో...

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం జరిగిన క్యారమ్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు చిమట రామారావు, లైబ్రేరియన్ పీడీ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. పురుషోత్తపట్నం, ముస్తాబాద, ఉంగుటూరు గ్రంథాలయాల్లో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు.

ఘనంగా వాసవి జయంతి



సామూహిక కుంకుమపూజలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వాసవి జయంతిని పురస్కరించుకుని స్థానిక ఏలూరురోడ్డులోని ఆర్య వైశ్య కల్యాణ మండపం ప్రాంగణంలోని వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ఆర్యవైశ్య ప్రముఖులు బొమ్మిశెట్టి రామారావు, కొనకళ్ల రాజశేఖర్, చామర్తి రాంబాబు, రామకృష్ణ, చామర్తి లోక్‌నాథ్, నారికమల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవం

పెనమలూరు: పెనమలూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. యనమలకుదురులో ఉన్న శ్రీరుక్మిణీ సమేత శ్రీసంతాన వేణుగోపాలస్వామివారి ఆలయంలో జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన పూజలు చేశారు. 10 గంటలకు సామూహిక కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఏపీ ఆర్యవైశ్య సంఘం చైర్మన్ డి.రాకేష్ పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు కొండవేటి బాబూరావు, అధ్యక్షుడు బుద్ధా లక్ష్మణకుమార్, ప్రధాన కార్యదర్శి తటపర్తి సతీష్, కోశాధికారి తాతా వెంకట కిషోర్‌కుమార్, వర్కింగ్ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సభ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఈ నెల 9వ తేదీన ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక సభ ఏర్పాటు చేస్తున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు బుధవారం తెలిపారు. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు. స్థానిక నూజివీడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో సాయంత్రం 5.30 గంటల నుంచి ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రజా వినతులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

గన్నవరం: తిరుపతిలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలో ఎన్డీఏ ప్రభుత్వం విఫలమైందన్నారు. యువతకు మద్దతుగా చేపట్టే ఉద్యమ కార్యాచరణను జాతీయ మహాసభల్లో ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు నియోజకవర్గంలోని యువత తరలిరావాలని కోరారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ద్వారా అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ, అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ పీడీ ఎం.ఎన్.రాణి బుధవారం తెలిపారు. జిల్లాలో రెండు అంగన్‌వాడీ పోస్టులు, ఒక మినీ అంగన్‌వాడీ పోస్టుతో పాటు 51 అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులను రోస్టర్ పద్ధతిలో భర్తీ చేసేందుకు నిర్ణయించామన్నారు. జిల్లాలోని బందరు, బంటుమిల్లి, పామర్రు, గుడివాడ, కంకిపాడు, మొవ్వ, గన్నవరం, అవనిగడ్డ ప్రాజెక్టుల పరిధిలో ఈ పోస్టులు ఉన్నాయన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత సీడీపీవో ఆఫీసును సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల వయసు 21 నుంచి 31 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత పొంది వివాహితై ఉండాలని, మిగిలిన వివరాల కోసం సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ అధికారులను సంప్రదించాలని ఆమె సూచించారు.

కానూరులో వివాహిత అదృశ్యం

పెనమలూరు: కానూరులో వివాహిత అదృశ్యమైన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ నుంచి ఎండీ షాజహాన్ కుటుంబ సభ్యులతో కానూరు సనత్‌నగర్ వచ్చి చాలా సంవత్సరాలుగా ఇక్కడ నివసిస్తున్నారు. ఆయన కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు ఐదుగురు పిల్లలు. పెద్ద కుమార్తె తబస్సుమ్‌కు వివాహం అయింది. ఆమెకు ఇద్దరు పిల్లలు. ఈ నెల 4వ తేదీన తబస్సుమ్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో తండ్రి షాజహాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శిక్షణ అనంతరం విధుల్లో చేరిన ఎంపీడీఓ

విజయవాడరూరల్: ఎంపీడీఓ బి.విగ్గిన్స్ మూడు నెలల పాటు శాఖాపరమైన శిక్షణ పూర్తి చేసుకుని బుధవారం తిరిగి ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఎంపీడీఓగా డైరెక్ట్ రిక్రూట్ అయిన విగ్గిన్స్ ఫిబ్రవరి 5వ తేదీ నుంచి మూడు నెలల పాటు శిక్షణ పూర్తి చేశారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఏఓ పి.మురళీకృష్ణప్రసాద్ బాధ్యతలు నిర్వహించారు. విగ్గిన్స్ బుధవారం తిరిగి ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అనంతరం గ్రేడ్ 5 నుంచి గ్రేడ్ 4 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి పొంది బదిలీ అయిన వారితో సమావేశమయ్యారు.

విద్యుత్ విజిలెన్స్ బృందం విస్తృత తనిఖీలు

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలో విద్యుత్ విజిలెన్స్ బృందం బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించింది. విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు, ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ పర్యవేక్షణలో 30 మంది అధికారులు, 50 మంది సిబ్బంది 35 బృందాలుగా ఏర్పడి విద్యుత్ మీటర్లను తనిఖీ చేశారు. పట్టణంతో పాటు గండిగుంట, శివారు గ్రామాలు ఎనికేపాడు, నాగన్నగూడెం, ఆనందపురం, మూర్తిరాజు గూడెం ప్రాంతాల్లో వ్యాపార, గృహ వినియోగ సర్వీసులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో 209 విద్యుత్ సర్వీసులు అదనపు విద్యుత్ వాడకం జరుగుతున్నట్లు గుర్తించారు. ఇందుకు గానూ సంబంధిత యజమానులకు రూ.6,98,500 జరిమానాగా విధించారు. తనిఖీల అనంతరం ఈఈలు వాసు, కృష్ణనాయక్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగానికి పాల్పడితే చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. అనుమతించిన లోడు కంటే అదనపు విద్యుత్ వాడినా, కేటగిరీలు మార్చి వినియోగించినా, విద్యుత్ చౌర్యంకు పాల్పడినా విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం తగు చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. తనిఖీల్లో డీఈఈలు డి.హేమకుమార్, శివనాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, శ్రీనివాసులు, ఏఈ బసవశాస్త్రులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పెనమలూరు: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఏపీ ఐజీ (ఈగల్) ఎ.కె.రవికృష్ణ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రవికృష్ణ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తాయన్నారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు అరికట్టడానికి విద్యార్థులు తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ ఎవరైనా మాదకద్రవ్యాలు అమ్మినా, వినియోగించినా తమకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ డీఅడిక్షన్ సెంటర్ డాక్టర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐజీ రవికృష్ణ, ఎస్పీ గంగాధరరావు, విద్యార్థులు

స్వరాజ్యలక్ష్మి, ఏపీ యూత్ అసోసియేషన్ సీఈవో యు.శ్రీనివాసరావు, యువజన సేవా విభాగం సహాయక మేనేజర్ డి.సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ టి.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఫలితాలు అద్భుతం

- జపాన్ బృందం ప్రశంస
- బోళ్లపాడులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

ఉయ్యూరురూరల్: ప్రకృతి వ్యవసాయ ఫలితాలు అద్భుతం అని, అందులో మహిళల పాత్ర అమోఘమని జపాన్ బృందం సభ్యులు ప్రశంసించారు. ఉయ్యూరు మండలం బోళ్లపాడులో నిర్వహిస్తున్న ప్రకతి వ్యవసాయ క్షేత్రాలను బుధవారం జర్మన్ ప్రభుత్వ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జర్మన్‌కు చెందిన బ్యాంక్ కేఎఫ్‌డబ్ల్యూఎఫ్ దక్షిణ ఆసియా డైరెక్టర్ కారోలిన్ గన్సార్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన ప్రకృతి వ్యవసాయాన్ని అభివృద్ధి పరిచేందుకు జర్మన్ ప్రభుత్వం కెఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు ద్వారా ప్రత్యేక ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కెఎఫ్‌డబ్ల్యూ ఇండియా ఆఫీస్ డైరెక్టర్ ఒల్స్ ముత్తు, నేచురల్ రిసోర్స్ మేనేజ్మెంట్ సీనియర్ సెక్టార్ స్పెషలిస్ట్ సంగీత అగర్వాల్‌తో కూడిన బందం గ్రామంలో విస్తృతంగా పర్యటించింది. సి.మోహన్‌రావుకు చెందిన వ్యవసాయ క్షేత్రం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం(ఏపీసీఎన్ఎఫ్) జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పార్థసారథి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలపై ఏర్పాటు చేసిన చక్రంను పరిశీలించింది. అనంతరం సి.మోహన్‌రావు అరటి ఏ గ్రేడ్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి ప్రకృతి వ్యవసాయ సూత్రాలను, అనుసరిస్తున్న విధానాలను అరటి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న ఏటీఎం ఎనీ టైం మనీ నమూనాను పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్, సీనియర్ థిమాటిక్‌లు తరు, సుధాకర్, లీడ్ సురేష్, వ్యవసాయ శాఖ గన్నవరం డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ సునీల్, మండల వ్యవసాయ శాఖ అధికారి నిస్సి గ్రేస్ , డిస్ట్రిక్ట్ మోడల్ మేకర్ నిర్మల, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ అడిషనల్ మేనేజర్ నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.



జీవ ఉత్ప్రేరకాలు, కషాయాల తయారీపై నిర్వహిస్తున్న డెమో పరిశీలిస్తున్న జర్మన్ ప్రభుత్వ బృందం



ఆత్కూరులో ఫార్మర్ సైంటిస్ట్‌లు, మెంటార్లతో సమావేశమైన జర్మన్ బృందం

స్వర్ణభారత్‌ను సందర్శించిన జర్మన్ బ్యాంక్ బృందం

ఆత్కూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జర్మన్‌కు చెందిన ప్రభుత్వ బ్యాంక్ కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధి బృందం బుధవారం డెల్టా పరిధిలోని రైతు శాస్త్రవేత్తలు, మెంటార్లతో సమావేశమయ్యారు. తొలుత ట్రస్ట్ భవనంలో ఫార్మర్ సైంటిస్ట్ కోర్స్ వివరాలను, ప్రకృతి వ్యవసాయంలో అనుసరించే పద్ధతులపై ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించారు. ప్రకృతి వ్యవసాయ ఫలితాల పట్ల ఈ బృందం సంతృప్తిని వ్యక్తం చేయడంతో పాటు ఫార్మర్ సైంటిస్ట్‌లు, మెంటార్లను అభినందించారు.

శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు

గన్నవరం: స్థానిక శ్రీకృష్ణనగర్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ వార్ల దేవస్థానంలో బుధవారం ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి సజీవ సమాధి అయిన రోజును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవం జరిపారు. తొలుత ఆలయ అర్చకుడు కర్రి మల్లికార్జునరావు నేతృత్వంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీవీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ఆలయ కమిటీ సభ్యులతో పాటు పరిసర ప్రాంత భక్తులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపాక వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి పుట్టా సుధీర్‌కుమార్, కోశాధికారి వజ్రాల రాంబాబు, సభ్యులు బ్రహ్మం, నాగరాజు, అనంత్‌కుమార్, సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆరాధనోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

అమ్మవారి భూమిపై విచారణ వేగవంతం

సాక్షి స్పందన

కంకిపాడు: అమ్మవారి భూమిపై శాఖాపరమైన విచారణ వేగవంతమైంది. 'అమ్మవారి భూమి అన్యాక్రాంతం' శీర్షికన నెప్పల్లి గ్రామంలో చోటుచేసుకున్న భూమాయపై బుధవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై తహసీల్దార్ కార్యాలయ అధికారులు రికార్డుల పరిశీలనలో పడ్డారు. గ్రామానికి సంబంధించిన ఫీల్డ్ మ్యాప్‌లు, అందుబాటులో ఉన్న అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలన జరుపుతున్నారు. ఆర్ఎస్ఆర్‌లో కనకదుర్గ అమ్మవారి దేవస్థానంగా నమోదైన భూమి, అడంగల్‌లో సత్రం భూమిగా ఎలా మార్పు చెందిందన్న విషయమై వివరాలు సేకరిస్తున్నారు. విజయవాడకు చెందిన సత్రం తాలూకా ట్రస్టు నిర్వాహకులకు ఇప్పటికే సమాచారాన్ని అందించారు. తమ వద్ద ఉన్న భూమి రికార్డులు, భూమి కేటాయింపులకు సంబంధించిన వివరాలతో రావాలని సూచించినట్లు తెలుస్తోంది. మరోవైపు కనకదుర్గ అమ్మవారి దేవస్థానం భూమికి సంబంధించి దేవదాయశాఖ అధికారులు ప్రత్యేకంగా విచారణ సాగిస్తున్నారు. కమిషనరేట్ కార్యాలయ అధికారులే స్వయంగా దృష్టి సారించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయ భూమిలో రోడ్డు నిర్మాణం ఎలా చేశారు?, ఎవరు బాధ్యులు? అన్న వివరాలు సేకరిస్తున్నారు. అటు రెవెన్యూ, ఇటు దేవదాయ శాఖల ప్రత్యేక పర్యవేక్షణలో అమ్మవారి భూమి వ్యవహారం త్వరలోనే కొలిక్కి రానుంది.

మైత్రి యాడ్స్‌పై బాధితుల ఫిర్యాదు

పటమట(విజయవాడతూర్పు): మాకు లక్ష డిపాజిట్ చేయండి.. మీకు నెలకు రూ. 12 వేలు ఇస్తామని ఓ కంపెనీ సామాన్యులకు కుచ్చుటోపీ పెట్టిన ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ ఎనికేపాడు శివాలయం వీధిలోని జిన్నా మార్కెటింగ్ కంపెనీకి చెందిన మైత్రి యాడ్స్ స్కీంకు డబ్బులు కడితే అధిక రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశ చూపడంతో కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన ముగ్గురు కలిసి రూ. 3.66 లక్షలు కట్టి మోసపోయారు. మొదటి నెల సంబంధిత కంపెనీ రూ.12 వేలు చెల్లించి ఆ తర్వాత నుంచి చెల్లింపులు ఆపేసింది. రెండేళ్లు గడుస్తున్నా డబ్బులు చెల్లించకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు వీరవల్లి గ్రామానికి చెందిన దిండి సుబ్బారావు, అతని భార్య దిండి రంగమ్మ, అత్తయ్య రెడ్డి రమణమ్మ విజయవాడ పోలీసు కమిషనరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదికలో, పటమట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.